మహిళల ఆర్థిక ప్రగతికి ఆసరా


ప్రత్తిపాడులో ఆసరా మెగా చెక్‌ను డ్వాక్రా మహిళలు, వీవోఏలకు అందజేస్తున్న ఎమ్మెల్యే సుచరిత, వేదికపై జెడ్పీటీసీ కృష్ణారెడ్డి, ఎంపీపీ అన్నమ్మ తదితరులు


సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే సుచరిత, మహిళలు

- ఎమ్మెల్యే మేకతోటి సుచరిత
- ప్రత్తిపాడులో మూడో విడత ఆసరా సంబరాలు

ప్రత్తిపాడు: స్వయం సహాయక సంఘాల్లోని మహిళల జీవితాల్లో 'ఆసరా'తో ఆర్థిక ప్రగతి లభిస్తోందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత చెప్పారు. ప్రత్తిపాడులో వైఎస్సార్ క్రాంతి పథం ఆధ్వర్యంలో బుధవారం మూడో విడత 'వైఎస్సార్ ఆసరా' పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సుచరిత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలుత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. డ్వాక్రా మహిళలకు మెగా చెక్కును అందజేశారు. ఎమ్మెల్యే సుచరిత మాట్లాడుతూ జగనన్న సంక్షేమ పథకాలన్నీ మహిళాభివృద్ధికి దోహదం చేస్తున్నాయన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామీనీ అమలు చేస్తున్నారన్నారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకోకుండా డ్వాక్రా మహిళలను మోసం చేసిన వారు కావాలో, మాటకు కట్టుబడి మహిళలకు అండగా నిలుస్తున్న వారు కావాలో తేల్చుకోవాలని సుచరిత డ్వాక్రా మహిళలకు సూచించారు. గతంలో చంద్రబాబు నాయుడు ఎవరూ రుణాలు కట్టవద్దని, అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతి రూపాయి కట్టేస్తానని ఎన్నికల సమయంలో కల్లబొల్లి మాటలు చెప్పారని, అధికారంలోకి వచ్చిన తరువాత ఆనాటి హామీలను తుంగలో తొక్కి డ్వాక్రా వ్యవస్థను నాశనం చేశారని సుచరిత గుర్తుచేశారు. చంద్రబాబు మాట నమ్మి డ్వాక్రా రుణాలు కట్టకుండా గ్రూపులన్నీ డిఫాల్టర్లుగా మారిపోయాయని దుయ్యబట్టారు. కానీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే ఇచ్చిన మాటకు కట్టుబడి డ్వాక్రా రుణమాఫీ చేస్తున్నారన్నారు. అందులో భాగంగానే ఏటా క్రమం తప్పకుండా ఆసరా పథకాన్ని అమలు చేస్తున్నారన్నారు. రాజకీయ నాయకులకు కృతజ్ఞతను ఓటు ద్వారా అండగా ఉంటామని చూపిస్తామని, ఇంత సాయం పొందిన మహిళలు ఓటు అడగకుండానే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదిస్తారని చెప్పారు.

నియోజకవర్గంలో రూ.105.69 కోట్ల లబ్ధి

నియోజకవర్గంలోని డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా ఇప్పటి వరకు మూడు విడతల్లో రూ.105.69 కోట్ల లబ్ధి చేకూరిందని ఎమ్మెల్యే సుచరిత చెప్పారు. 4,235 గ్రూపులకు మొదటి విడతలో రూ.35.20 కోట్లు, రెండో విడతలో రూ. 35.27 కోట్లు, మూడో విడతలో రూ.35.23 కోట్ల చొప్పున నగదును సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేరుగా డ్వాక్రా అక్కచెల్లెమ్మల ఖాతాలకు జమ చేశారని సుచరిత వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు విప్పాల కృష్ణారెడ్డి, గుల్జార్‌బేగం, ఎంపీపీ దాసరి అన్నమ్మ, మాజీ మండల కన్వీనర్ గట్టు విజయ్‌కుమార్, ఎంపీడీవో శ్రీరమ్య, తహసీల్దార్ సంజీవకుమారి, ఏపీఎం సురేష్‌కుమార్, ప్రత్తిపాడు మార్కెట్ యార్డు చైర్మన్ మెట్టు రాజేశ్వరి, రైతు విభాగం జిల్లా కన్వీనర్ ఓంప్రకాష్‌రెడ్డి, సేవాదళ్ జిల్లా కన్వీనర్ మురళి, వైస్ ఎంపీపీలు అఫ్రినాసుల్తానా, తమ్మా రమాదేవి, ఎంపీటీసీలు సాయి, మరియరత్తమ్మ, ఉపసర్పంచ్ వెంకటేశ్వరరెడ్డి, పార్టీ నాయకులు లక్ష్మారెడ్డి, పరమారెడ్డి, సుబ్బారావు, రామారావు, అమృతయ్య, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

సంక్షేమ సారథి జగనన్న

ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్


జగనన్నే మా భవిష్యత్- మా నమ్మకం నువ్వే జగన్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మర్రి రాజశేఖర్, సుచరిత


ర్యాలీలో పాల్గొన్న మర్రి రాజశేఖర్, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత తదితరులు

గుంటూరు రూరల్: ఇచ్చిన మాటను తప్పకుండా ప్రతి పథకాన్ని ప్రతి కుటుంబానికీ అందిస్తూ పేదల అభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషిచేస్తున్నారని వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ చెప్పారు. బుధవారం మండలంలోని ఓబులునాయుడుపాలెం గ్రామంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత నేతృత్వంలో జగనన్నే మా భవిష్యత్– మా నమ్మకం నువ్వే జగన్ పోస్టర్ ఆవిష్కరణ, భారీ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్సీ రాజశేఖర్ మాట్లాడుతూ ఈనెల 7 నుంచి 20 వరకూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు చెప్పారు. ప్రభుత్వ పనితీరును ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. గృహసారథులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు సమష్టిగా కృషిచేసి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం గురించి ప్రజలకు వివరించాలన్నారు. ఎమ్మెల్యే మేకతోటి సుచరిత మాట్లాడుతూ బలహీనవర్గాలకే కాకుండా అగ్రవర్ణాలకు సంక్షేమ పథకాలను అందించిన ఏకైక నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని తెలిపారు. విపత్కర పరిస్థితుల్లోనూ సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత జగనన్నకే దక్కుతోందన్నారు. అనంతరం పోస్టర్‌ను ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే ఆవిష్కరించారు. నాయకులు, కార్యకర్తలతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు తుమ్మల సుబ్బారావు, షేక్ గుల్జార్ బేగం, గ్రామ సర్పంచ్ కేశం శ్రీలక్ష్మి, కేశం హరనాథ్, మండల కన్వీనర్‌లు ఆళ్ళ రవిదేవరాజు, గట్టు విజయ్‌కుమార్, ఆర్‌అండ్‌బీ డైరెక్టర్ పిల్లి మేరి, పత్తిపాడు వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ మెట్టు రాజేశ్వరి, సోషల్ మీడియా మండల కన్వీనర్ పుట్టా బాజీ, సొసైటీల చైర్మన్‌లు తంగెళ్ళ నాగేశ్వరావు, నాగం కాశీవిశ్వనాథం, దుంపాల రాధ, కందుకూరి జ్యోతి, మన్నెం లక్ష్మి, సాయి, మబ్బు సుధాకర్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే జగనన్న ప్రభుత్వ లక్ష్యం

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత
- ఓబులునాయుడుపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం


ప్రజలకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

గుంటూరు రూరల్: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ఓబులునాయుడుపాలెం గ్రామంలో గ్రామ సర్పంచ్ కేశం శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఎమ్మెల్యేకు స్థానిక ప్రజలు సాదర స్వాగతం పలికారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి మూడున్నరేళ్లలో ప్రతి గడపకూ అందిన సంక్షేమ ఫలాల గురించి వివరించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో జరిగిన అభివృద్ధి పనుల గురించి చెప్పారు. సంక్షేమ ప్రభుత్వంపై బురద జల్లుతున్న టీడీపీ నేతలకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. మళ్లీ జగనన్నకు అండగా నిలవాలని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు తుమ్మల సుబ్బారావు, షేక్ గుల్జార్‌బేగం, మండల కన్వీనర్‌లు ఆళ్ళ రవిదేవరాజు, గట్టు విజయ్‌కుమార్, పత్తిపాడు వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్ మెట్టు రాజేశ్వరి, కేశం హరనాద్(బాజీ) ఆర్‌అండ్‌బీ కార్పొరేషన్ డైరెక్టర్ పిల్లి మేరి, సొసైటీల చైర్మన్‌లు తంగెళ్ళ నాగేశ్వరరావు, కాశీవిశ్వనాథం, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు మెట్టు వెంకటప్పారెడ్డి, దుపాల రాధ, మబ్బు సుధాకర్, మన్నెం లక్ష్మి, కందుకూరి జ్యోతి, సాయి తదితరులు పాల్గొన్నారు.

గృహసారథులే రథసారథులు


సమావేశంలో మాట్లాడుతున్న జల్లేపల్లి వేణుబాబు

గుంటూరు రూరల్: ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు అనేక సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారని వైఎస్సార్‌సీపీ గోరంట్ల 47వ డివిజన్ అధ్యక్షుడు జల్లేపల్లి వేణుబాబు చెప్పారు. బుధవారం గోరంట్ల గ్రామంలో వార్డు సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథుల అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామ, వార్డు సచివాలయం పరిధిలో ముగ్గురు కన్వీనర్లలో ఒక మహిళను భాగస్వామ్యం చేయ్యాలనే జగనన్న ఆలోచన గొప్పదన్నారు. గ్రామ వార్డు సచివాలయాల ద్వారా, వలంటీర్ వ్యవస్థ ద్వారా సుమారు నాలుగు లక్షల మందికి జగనన్న ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించారన్నారు. గృహ సారథులు, వలంటీర్లు ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి ప్రతి ఇంటికీ వెళ్ళి వారికి వివరించాలన్నారు. వారికి ఏమైనా సమస్యలు ఉంటే వాటిని జేసీఎస్ ఇన్‌చార్జ్‌కి తెలియజేయాలని, వెంటనే సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని సూచించారు. వైఎస్సార్ సీపీకి గృహ సారథులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు చాలా కీలకమన్నారు. జేసీఎస్ కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులు సమష్టిగా కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ పిల్లి నాగేశ్వరరావు, అల్లడి వీరబాబు, జంగా జయరాజు, తాళ్ళ వీరయ్య, చిలక శ్రీనివాసరెడ్డి, నల్లగొర్ల అంకమ్మరావు, ముత్యాల వెంకటరావు, ఆరిగల లక్ష్మయ్య, చిల్లర పవన్‌కిషోర్, పచ్చల రామకోటయ్య, దుంపాల రాఘవేంద్రరావు, జల్లేపల్లి రామకృష్ణ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చెట్టుకు ఉరివేసుకుని గుర్తు తెలియని వ్యక్తి మృతి



పెదకాకాని: చెట్టుకు ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన తక్కెళ్ళపాడు శివారు ప్రాంతంలో చోటు చేసుకుంది. పెదకాకాని మండలం తక్కెళ్ళపాడు సదాశివరావు కాలనీలోని నిర్మానుష్య ప్రాంతంలో బుధవారం ఉదయం చెట్టుకు మృతదేహం వేలాడుతూ కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని కిందకు దించి పరిశీలించారు. మృతుని వద్ద ఎటువంటి ఆధారాలు లభ్యం కాలేదు. సుమారు 50 ఏళ్ల వయస్సు ఉన్న మృతుడి జేబులో చిల్లర డబ్బులు, బీడీ కట్ట మాత్రమే ఉన్నాయి. గుర్తు తెలియని వ్యక్తి చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లుగా నిర్ధారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

పెదకాకాని: వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్‌ను కులంపేరుతో దూషించిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పెదకాకాని మండలం, తక్కెళ్ళపాడు వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్‌గా మేరుగ సుబ్బారావు, సభ్యులుగా కూచిపూడి చిన్నప్ప, నీలం నాగేశ్వరరావు పనిచేస్తున్నారు. సొసైటీలో ఐదు నెలల క్రితం కమిటీ భవనానికి ప్రహరీ, ఆర్చి, వాష్‌రూమ్‌లు, రోడ్లు, పెయింటింగ్‌లు వేసేందుకు తీర్మానం చేశారు. ప్రభుత్వం నుంచి నిధులు రాగానే పనులు పూర్తి చేసి వైఎస్ రాజశేఖరరెడ్డి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య శిలాఫలకాల ఏర్పాటుకు పనులు చేపట్టారు. దీనిపై గ్రామానికి చెందిన అయినంపూడి లింగయ్య, మోపర్తి వేణు, మాచవరపు మల్లేశ్వరరావు, బీరపునేని లక్ష్మణరావు వాగ్వివాదానికి దిగారు. నువ్వు ఎక్కడో పల్లెలో పుట్టి ఊళ్ళో బొమ్మలు పెడతావా, ఎవరిని అడిగి బొమ్మలు పెడుతున్నావు, అంటూ కులం పేరుతో దూషించారు. శిలాఫలకాలను ధ్వంసం చేస్తామని హెచ్చరించారు. మార్చి 25వ తేదీ రాత్రి సొసైటీ గోడకు అమర్చిన శిలాఫలకాలను ధ్వంసం చేశారు. దీనిపై సొసైటీ చైర్మన్ మేరుగ సుబ్బారావు ఫిర్యాదు మేరకు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు.

నాసా కాంటెస్ట్‌లో విజేతలుగా నిలిచిన శ్రీచైతన్య విద్యార్థులు



గుంటూరు ఎడ్యుకేషన్: అమెరికాలోని నాసా నిర్వహించిన అంతరిక్ష పరిశోధన పోటీలో ప్రతిభ చూపిన శ్రీచైతన్య స్కూల్ నెహ్రూనగర్ బ్రాంచ్ విద్యార్థుల్ని సంస్థ ఏజీఎం డాక్టర్ నూతలపాటి అంజయ్య అభినందించారు. రింగ్ రోడ్డులోని శ్రీచైతన్య స్కూల్స్ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నాసా అంతరిక్ష పరిశోధన కాంటెస్ట్–2023లో "స్పేస్ ఫ్యూచర్" పేరుతో పరిశోధన పత్రాన్ని సమర్పించడం ద్వారా శ్రీచైతన్య పాఠశాలలు ప్రపంచంలో మూడో స్థానంలో నిలిచాయని తెలిపారు. మన దేశం నుంచి ఎంపికైన 89 ప్రాజెక్టుల్లో 54 శ్రీచైతన్య పాఠశాలలకు చెందినవి కాగా, వాటిలో నెహ్రూనగర్ బ్రాంచ్ నుంచి విద్యార్థులు ఉన్నారని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థుల్ని అంజయ్యతో పాటు ప్రిన్సిపాల్ కృష్ణవేణి, కో–ఆర్డినేటర్ గోవర్ధన్, డీన్ శివశంకర్, నాసా కాంటెస్ట్ ఇన్‌చార్జ్ మనీషా, ఉపాధ్యాయులు పాల్గొని అభినందించారు.

మిర్చి టిక్కీల చోరీ కేసులో నిందితుడి అరెస్టు

పట్నంబజారు: మిర్చి టిక్కీల చోరీ కేసులో ఏడుగురిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 2న ఏటుకూరు రోడ్డులోని శ్రీహరి కాటన్ జిన్నింగ్ మిల్లులో ఉన్న మిర్చి గోడౌన్‌లో పది మిరప టిక్కీలు చోరీ అయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు గుంటూరుకు చెందిన చినపాటి వందనం, చినపాటి రాకేష్, బి.హనుమంతు, తిరుమల బాలకృష్ణ, నలబోలు రవి, పడవల శ్యామ్‌కుమార్, మద్దెల అరుణను అరెస్టు చేసి వారి నుంచి రూ. 1.20 లక్షల విలువ చేసే మిర్చి టిక్కీలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్ని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తిపై దాడి చేసి నగదు లాక్కుని పరారీ

పోలీసునని చెప్పి వ్యక్తిపై దాడి చేసి నగదు లాక్కొని పరారైన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...ఆర్టీసీ కాలనీకి చెందిన ఆవుల గురువారెడ్డి 4న రాత్రి వైజాగ్ వెళ్లి వచ్చి ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆటో దిగి ఇంటికి నడుచుకుంటూ వెళుతున్నాడు. ఈ క్రమంలో రంగిశెట్టి ప్రవీణ్‌కుమార్ పూటుగా మద్యం తాగి తాను పోలీసునని భయపెట్టి గురువారెడ్డి వద్ద రూ. 600 లాక్కొని వెళ్లిపోయాడు. బాధితుడు పోలీసులకు సమాచారం ఇవ్వగా నిందితుడ్ని అదుపులోకి తీసుకున్నారు. అతడిపై గతంలో ఏడు చైన్ స్నాచింగ్, ఇతరత్రా చోరీ కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

మన భవిష్యత్తు.. నమ్మకం జగనన్నే


పొన్నూరు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య తదితరులు

- 7నుంచి జరిగే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి
- పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య
- 'జగనన్నే మా భవిష్యత్.. మా నమ్మకం నువ్వే జగన్' పోస్టర్ ఆవిష్కరణ

చేబ్రోలు: రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబానికి పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందని పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య చెప్పారు. పొన్నూరులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం జగనన్నే మా భవిష్యత్తు.. మా నమ్మకం నువ్వే జగన్ పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈనెల 7 నుంచి 20వ తేదీ వరకు తలపెట్టిన ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలలో 98 శాతం నెరవేర్చి చరిత్ర సృష్టించారన్నారు. రాష్ట్రంలో కుల, మత, వర్గ, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు గడప గడపకు అందుతున్నాయన్నారు. మళ్లీ జగన్ సీఎం కావాలి.. అనే నినాదంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రజల్లో నమ్మకం, విశ్వాసాన్ని కలిగించే విధంగా వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఈ నాలుగేళ్ల కాలంలో జగనన్న పనితీరును వివరించి వారి సమస్యలు అడిగి పరిష్కరించే దిశగా పనిచేయాలన్నారు. పొన్నూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, జేసీఎస్ కన్వీనర్లు భవనం వంశి రెడ్డి, సాంబశివరావు, బొద్దులూరి రంగారావు, రుద్రపాటి ఆదిశేషులు, కె.శ్రీనివాసరావు, మాము, గేరా సంజీవ్, దేవరకొండ గోపి పాల్గొన్నారు.

దుష్ప్రచారం చేయడం టీడీపీకి వెన్నతో పెట్టిన విద్య

ప్రజలను మభ్యపెట్టి, మోసగించటం, దుష్ప్రచారాలు చేయటం టీడీపీకి వెన్నతోపెట్టిన విద్య అని పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య విమర్శించారు. పొన్నూరు పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో గత 25 ఏళ్లలో చేయలేని అభివృద్ధిని ఈ మూడున్నరేళ్లలో చేశామని స్పష్టం చేశారు. ప్రజలను పక్కదారి పట్టించటం కోసం అవినీతి, అసత్య ఆరోపణలతో ఎల్లో మీడియాలో ప్రచారం చేస్తున్నట్లు విమర్శించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఆకుల వెంకటేశ్వరరావు, భవనం వంశీరెడ్డి, బొద్దులూరి రంగారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు తక్కెళ్లపాడులో ఉచిత కంటి వైద్యశిబిరం

పెదకాకాని: తక్కెళ్ళపాడు గ్రామంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు శంకర కంటి ఆస్పత్రి పీఆర్వో సురేష్ తెలిపారు. పెదకాకాని మండలంలోని తక్కెళ్ళపాడు శివాలయం వద్ద శంకర కంటి ఆస్పత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్తంగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. ఉదయం 9 గంటల నుంచి శిబిరం ప్రారంభమవుతుందని వెల్లడించారు.

సీహెచ్‌ఓల క్రమబద్ధీకరణకు కృషి చేయాలి

గుంటూరు ఎడ్యుకేషన్: కమ్యూనిటీ వైద్యాధికారులను (సీహెచ్‌ఓ) క్రమబద్ధీకరించే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన కమ్యూనిటీ వైద్యాధికారుల బృందం బుధవారం ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావుకు బ్రాడీపేటలోని యూటీఎఫ్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఉమ్మడి గుంటూరు జిల్లాల సంఘ నాయకులు పులి ప్రేమ్ కుమార్, నాగరాజు మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్లు (వైయస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్స్) ద్వారా గ్రామాల్లో వైద్య సేవలు అందిస్తున్న సీహెచ్‌వోల క్రమబద్ధీకరణకు కృషి చేయాలని కోరారు. సీహెచ్‌వోలను రెగ్యులరైజ్ చేసే వెసులుబాటు రాష్ట్రాలకే ఉందని, జీతభత్యాల్లో 60 శాతం నిధుల్ని కేంద్ర ప్రభుత్వమే భరిస్తున్నందున రెగ్యులరైజేషన్ చేయడం వల్ల రాష్ట్ర ప్రభుత్వంపై ఆర్థిక భారం పడదని తెలియజేశారు. ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ రెగ్యులరైజేషన్‌తో పాటు 10 నెలలుగా పెండింగ్‌లో ఉన్న ఇన్సెంటివ్స్ ఇవ్వాలని కోరారు.

మహోన్నత వ్యక్తి జగ్జీవన్‌రామ్

పొన్నూరులో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ

చేబ్రోలు/గుంటూరు రూరల్/పెదకాకాని: మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ మహోన్నత వ్యక్తి అని పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య చెప్పారు. పొన్నూరు పట్టణంలోని రేపల్లె బస్టాండ్ సెంటర్లో కొత్తగా ఏర్పాటు చేసిన జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ కార్యక్రమం బుధవారం రాత్రి జరిగింది. అనంతరం జరిగిన బహిరంగ సభలో ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వర ప్రసాదరావు మాట్లాడుతూ దళిత వర్గాలకు బీఆర్ అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ రెండు కళ్ళు లాంటి వారన్నారు. అంతకుముందు దళిత నాయకులు, యూత్ సభ్యులు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. సభ అనంతరం విగ్రహదాత డాక్టర్ జి.శామ్యూల్, అతిథులను నిర్వాహకులు సన్మానించారు. జాతీయ మాదిగ ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షులు ప్రొఫెసర్ శ్రీనివాసరావు, ఏపీ మానవ హక్కుల కమిషన్ సభ్యుడు శ్రీనివాసరావు గోచిపాత, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ మందపాటి శేషగిరిరావు, షేక్ సైపుల్ల, దాసరి నారాయణరావు, గూడవల్లి పద్మావతి గంగాధర్, పెరికల కృష్ణమోహన్, మోపర్తి కమలమ్మ, షేక్ మాము తదితరులు పాల్గొన్నారు.

- చేబ్రోలు మండలంలోని పలు గ్రామాల్లో జగ్జీవన్ రామ్ జయంత్యుత్సవాలు జరిగాయి.
- గుంటూరు నగరంలోని ఎమ్మెల్యే మేకతోటి సుచరిత క్యాంపు కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ జయంత్యుత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యేతోపాటు మాజీ ఇన్‌కంటాక్స్ కమిషనర్ మేకతోటి దయాసాగర్ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్‌చేసి స్వీట్లు పంచారు.
- పెదకాకాని మండలంలోని పలు గ్రామాల్లో జగ్జీవన్‌రామ్ జయంత్యుత్సవాలు జరిగాయి. కార్యక్రమాల్లో ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ళ జ్యోతి, పెదకాకాని సర్పంచి గోళ్ళ స్వరూపరాణి, ఎంపీటీసీ సభ్యురాలు షేక్ గుల్జార్, వెనిగండ్ల సర్పంచి వేల్పుల శ్రావణి, సచివాలయం కన్వీనర్ బుల్లా మోజెస్, పేతురు, వేల్పుల నాగరాజు, మాణిక్యరావు, ముత్తయ్య, మార్కెట్‌యార్డు డైరెక్టర్‌లు బందెల ఉదయ్‌శంకర్, కొంకిరామారావు పాల్గొన్నారు.
- నగర శివారుల్లోని లాం నందున్న విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో జగ్జీవన్‌రామ్ జయంత్యుత్సవం నిర్వహించారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేంద్ర వ్యవసాయ మంత్రిగా జగ్జీవన్‌రామ్ చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామారావు, విస్తరణ సంచాలకులు డాక్టర్ సుబ్బరామిరెడ్డి పాల్గొన్నారు. నగర శివారుల్లోని లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానంలోనూ జగ్జీవన్‌రామ్ జయంత్యుత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఏడీఆర్ డాక్టర్ జి.సుబ్బారావు, డాక్టర్ ఎం.వి.రమణ, డాక్టర్ ఎస్‌బీఎస్ నరసింహారావు, డాక్టర్ నగేష్, జి. శ్రీనివాసరావు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.


జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా కేక్ కట్‌చేస్తున్న మేకతోటి సుచరిత


పొన్నూరులో జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే కిలారి, మాణిక్య వరప్రసాద్ తదితరులు


జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పించి మాట్లాడుతున్న వీసీ డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి


జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పించిన లాం శాస్త్రవేత్తలు

శివాలయంలో అర్చకుల మధ్య వివాదం

పెదకాకాని: శివాలయంలో అర్చకుల మధ్య ఆధిపత్యపోరు రోజు రోజుకూ వివాదాస్పదంగా మారుతోంది. బుధవారం ఆలయ సహాయ కమిషనర్, సిబ్బంది సాక్షిగా ఒకరిపై ఒకరు అసభ్యపదజాలంతో దూషణలకు దిగడం తీవ్ర వివాదమైంది. దీనిపై ఆలయ ప్రధాన అర్చకుడు పాతూర్తు ప్రసాద్ ఆలయ ఏసీ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. కొంతకాలంగా పెదకాకాని శివాలయంలో ఆధిపత్య పోరు కారణంగా వివాదాలు చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా రాహుకేతువు పూజలు చేసేందుకు అర్చకులు పోటీ పడుతున్నారు. పెదకాకాని భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో 21 మంది రెగ్యులర్ అర్చకులు, కాంట్రాక్ట్ అర్చకులు ఆరుగురు ఉన్నారు. వీరందరూ ఆలయం నుంచి వేతనాల రూపంలో రూ.13 లక్షల దాకా డ్రా చేస్తున్నారు. అనాదిగా స్వామికి నైవేద్యం అర్చకస్వాములు వంతుల వారీగా వారానికి ఒకరు చొప్పున ఏర్పాటు చేసేవారు. కొంతకాలంగా నైవేద్యం తయారు చేసేందుకు ఒక మనిషిని (పాకాచారి)ని నియమించారు. తాజాగా నైవేద్యం తయారు చేసిన వ్యక్తి ఆలయం వద్దకు తీసుకు వస్తే నైవేద్యం పెడతామని ఏసీ వద్ద ప్రతిపాదన తెచ్చారు. దీనిపై ఏసీ మందలించారు. ఆలయంలో మూడు రోజులుగా అర్చకులకు డ్యూటీలు మార్చే వ్యవహారం రగడగా మారింది. ఏ అర్చకుడూ ఒకే చోట విధులు నిర్వహించకుండా రోటేషన్ పద్ధతిలో విధులు నిర్వహించేలా చర్యలు చేపట్టారు. కొందరు అర్చకులు ఆలయానికి సంబంధం లేని బయట వ్యక్తులకు రోజు వారీ వేతనం ఇస్తూ అభిషేకాలు, పూజలు చేయించడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దేవదాయశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇప్పటికే పలు ఆలయాల్లో ప్లేటు కలెక్షన్‌లు నిలిపివేశారు. పెదకాకానిలో మాత్రం నిరంతరాయంగా కొనసాగుతున్నాయి. ప్రైవేటు అర్చకులను కొనసాగుతున్నా, భక్తులు అసౌకర్యానికి గురవుతున్నా ఆలయ అధికారులు కూడా ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికైనా దేవదాయశాఖ ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గౌరవ ప్రదమైన సాంప్రదాయాలు కొనసాగించాలని భక్తులు కోరుతున్నారు.

9న సినీ సంగీత విభావరి

పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో శ్రీ శుభాంజలి కళావేదిక ఆధ్వర్యంలో ఈ నెల 9న సూపర్ స్టార్ కృష్ణ సూపర్ హిట్స్ పేరుతో సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు మేకల పురుషోత్తమ్ ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.